క్లుప్తంగా

పాఠశాల తనిఖీ



పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ కెనడీ

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి కేఎఫ్ కెనడీ తెలిపారు. మండంలోని లింగంగుంటపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ప్రభుత్వంతో పాటు సమాజంలో ప్రతి ఒక్కరూ, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. నేడు ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలల్లో కంటే మెరుగ్గా మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయడంతో పాటు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలని ఆయన కోరారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్ జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్‌ను అందజేయటం తమ కళాశాల లక్ష్యమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో అధిత్రి సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 6 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటికే 1048 మంది ఉద్యోగాలను సాధించారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.రామారావు, సీహెచ్ శ్రీనివాసరావు, వి.జగదీష్ అభినందించారు.

మార్చి 5న మహిళా సదస్సును జయప్రదం చేయండి

గుంటూరు రూరల్: బ్రాహ్మణ మహిళల సమస్యల పరిష్కారానికి మార్చి 5వ తేదీన రాజమండ్రిలో నిర్వహించనున్న మహిళా సదస్సును విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రెంటచింతల దీప్తి పిలుపునిచ్చారు. బుధవారం నగర శివారుల్లోని ఇన్నర్‌రింగ్ రోడ్డులోని సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బ్రాహ్మణ మహిళల సాధికారత కోసం, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన ప్రతిభావంతులైన మహిళలకు ఝాన్సీలక్ష్మీబాయి నారీ పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగలక్ష్మి, అర్బన్ కార్యదర్శి ఏలూరి లక్ష్మి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు యనమండ్ర రామలక్ష్మి, జీడిగుంట్ల రామలక్ష్మి, జ్యోత్స్న పాల్గొన్నారు.

కాకుమాను పీహెచ్‌సీలో తొలి కాన్పు నమోదు

కాకుమాను: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం తొలికాన్పు నమోదు అయినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రవిప్రసాద్ తెలిపారు. మండల కేంద్రం కాకుమానులో ఆరోగ్య కేంద్రం స్థాపించి ఇప్పటికి సుమారు 39 సంవత్సరాలు పూర్తి కాగా అప్పటి నుంచి కొన్ని సంవత్సరాలు పాటు ఆరోగ్య కేంద్రం అద్దె భవనాలలో కొనసాగినట్లు ఆయన తెలిపారు. బుధవారం మండలంలోని రేటూరు గ్రామానికి చెందిన ఖుషీదా బేగం అనే మహిళ పురిటి నొప్పులతో పీహెచ్‌సీకి రాగా గర్భిణుకు సాధారణ కాన్పు నిర్వహించగా పండంటి ఆడశిశువుకు జన్మనిచ్చినట్లు చెప్పారు. తల్లి, శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను పొందాలని డాక్టర్ రవిప్రసాద్ తెలిపారు.

పది పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



కాకుమాను: పది పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని బోయపాలెం డైట్ కాలేజ్ లెక్చరర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు బుధవారం బోయపాలెం డైట్ కాలేజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పది విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదువుతూ రోజుకు ఒక పాఠ్యాంశాన్ని ఎంచుకుని పూర్తి స్థాయిలో ఆ సబ్జెక్ట్‌పై అవగాహన పెంచుకోవాలని, అప్పుడే పది పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ కేఎఫ్ కెనడీ, హెచ్ఎం టి.జోష్‌మేరీ పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో మెరిసిన 'ముట్లూరు'

- జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రయోగాలు
- ఒకే పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు మూడు ప్రాజెక్టులు ఎంపిక

ప్రత్తిపాడు: ఆ బాలలు మెదడుకు పదును పెట్టారు. విభిన్న ఆలోచనలతో కార్యరూపమిచ్చారు. సరికొత్త ఆవిష్కరణలతో సత్తా చాటి సైన్స్ ఫెయిర్‌లో ముట్లూరు హైస్కూల్ విద్యార్థులు అదరగొట్టారు. ఏకంగా ఒకే పాఠశాల నుంచి మూడు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యాయి. జిల్లా కేంద్రం గుంటూరులో ఈ నెల 14, 15 తేదీల్లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఇందులో వట్టిచెరుకూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. హెల్త్, సాఫ్ట్‌వేర్స్ అండ్ యాప్స్, క్లైమేట్ ఛేంజ్ విభాగాలలో వారు చేసిన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యాయి.

- హెల్త్ థీమ్ నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎస్.రిషిత 'స్మార్ట్ బేబీ ఫ్రెండ్లీ కార్డిల్' ప్రయోగం చేశారు.
- సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్ థీమ్ నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థి స్టీఫెన్‌పాల్ 'ఆటోమేటిక్ సోలార్ స్ట్రీట్ లైట్స్, ట్రాఫిక్ లైట్స్ (పైథాన్ ప్రోగాం) ప్రదర్శించారు.
- క్లైమేట్ ఛేంజ్ థీం నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థిని దివ్యశ్రీ 'క్లైమేట్ ఛైంజ్ అండ్ ఎన్విరాన్‌మెంట్' పై ఉత్తమ విజ్ఞాన ప్రదర్శన చేశారు.



'స్మార్ట్ బేబీ ఫ్రెండ్లీ కార్డిల్' ప్రయోగం



'ఆటోమేటిక్ సోలార్ స్ట్రీట్ లైట్స్, ట్రాఫిక్ లైట్స్ ప్రయోగం

ఈ ప్రదర్శనలు చేసిన విద్యార్థులు రాష్ట్రస్థాయికి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు బీఎస్ రామాంజనేయులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను జేసీ రాజకుమారి, ఆర్జేడీ సుబ్బారావు, డీఈఓ శైలజ, డెప్యూటీ ఈవో సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నారు. విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదునిచ్చిన రామాంజనేయులును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. ఎంపికైనా విద్యార్థులు ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని రామాంజనేయులు తెలిపారు.

టెలికం సేవలను సద్వినియోగం చేసుకోండి

గుంటూరు రూరల్: టెలికం సేవలను వినియోగదారులు తప్పకుండా తెలుసుకుని సద్వినియోగించుకోవాలని హైదరాబాద్‌కు చెందిన ట్రాయ్ రీజినల్ కార్యాలయం జాయింట్ అడ్వైజర్ వీఎస్ రాజు తెలిపారు. నగర శివారుల్లోని లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు టెలికం సేవల వినియోగంపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాయ్ ద్వారా తీసుకోబడిన వివిధ రకాల చర్యల సౌలభ్యాన్ని వినియోగదారులు ఏవిధంగా పొందాలి వాటిని ఏవిధంగా సద్వినియోగించుకోవాలి తెలిపారు. వినియోగదారులు తమ ఫిర్యాదులు ఏవిధంగా పరిష్కరించుకోవాలి, బిల్లు చెల్లింపులు, టారిఫ్ రేట్లు, విలువ ఆధారిత సర్వీసులు తెలిపారు. హైదరాబాద్ డాట్ సెంటర్ డైరెక్టర్ ఆఫ్ సెక్యూరిటీస్ కె.మురళీకృష్ణ మాట్లాడుతూ 5జీ సేవలు 20 జీపీఎస్ మెమరీ కలిగి ఉంటాయని వివరించారు. 5 జీ సేవలు గంటకు 500 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయన్నారు. ఏ డైరెక్షన్‌లో ఉన్న తరంగాలు సులువుగా వినియోగదారునికి అందుబాటులో ఉంటాయన్నారు. భవిష్యత్‌లో 5 జీ సేవలు విస్తృతంగా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ టెలికం సేవలు విద్యార్థులు తమ విద్యా, సాంకేతికత అభివృద్ధికి మాత్రమే వినియోగించుకుని సేవలను సద్వినియోగించుకోవాలని కోరారు. అనంతరం అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ కెవి రామారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

టెక్నికల్ ఎక్స్‌పోలో వీవీఐటీ విద్యార్థుల ప్రతిభ

పెదకాకాని: టెక్నికల్ ఎక్స్‌పో లో వీవీఐటీ విద్యార్థుల ఆవిష్కరణకు ప్రోత్సాహిక బహుమతి లభించిందని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం టెక్నికల్ ఎక్స్‌పోలో ప్రోత్సాహక బహుమతి సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని ఇంజినీరింగ్ విద్యార్థుల నూతన ఆవిష్కరణలను, ఆలోచనలను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా సినాప్‌సిస్ అఘస్త్యా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్వేషణ సైన్స్ ఇంజినీరింగ్ ఫేర్ పేరుతో హైదరాబాద్‌లో టెక్నికల్ ఎక్స్‌పో 2023 నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు డి.శశికిరణ్, ఎం.షారోన్‌రాజు, షేక్ రేష్మా, జి.వెంకట జ్వాలా, ఇంటర్నేషనల్ థింగ్స్ మిషన్ లెర్నింగ్ సాంకేతికతను వినియోగించి వ్యవసాయ ఉత్పత్తుల పెంపు, మొబైల్ రోబోట్‌ల ద్వారా అగ్రికల్చరల్ పనిముట్లను సులభంగా వినియోగించే విధంగా రూపొందించిన ఆవిష్కరణకు ప్రోత్సాహ బహుమతి రూ.5000 పురస్కారం పొందారన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించిన వారిలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అడకమిక్స్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, అడ్మిన్ డీన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి, సీఎస్ఓ విభాగాధిపతి డాక్టర్ సీవీఎస్ సురేష్, ప్రొఫెసర్ డాక్టర్ కేవీఎల్ సోమశేఖర్ ఉన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

మాతృ మరణాలు అరికట్టేందుకు కృషి

డీఎంహెచ్ఓ శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: వైద్యులు, సిబ్బంది సమష్టిగా పనిచేసి మాతృ మరణాలు తగ్గించేందుకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు ఆదేశించారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన మాతృ మరణాలపై జిల్లాస్థాయి మదింపు సమావేశం నిర్వహించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ ఆలు, ఆరోగ్య కార్యకర్తలు గర్భిణి పేరు నమోదు చేసిన నాటి నుంచి క్రమం తప్పకుండా వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించి, ఆరోగ్య పరిస్థితిని వారికి వివరిస్తూ, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదకర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లి ముందస్తుగా చికిత్స చేయించడం ద్వారా మాతృ మరణాలను తగ్గించవచ్చని చెప్పారు. స్థానిక ఆసుపత్రి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు గర్భిణులను కాన్పు నిమిత్తం తీసుకెళ్లినట్లయితే తక్షణమే ఆ విషయాన్ని సూపరింటెండెంట్‌కు తెలియజేయడం వల్ల వారు తగిన ఏర్పాట్లు చేసుకుంటారని తెలిపారు. జనవరిలో జిల్లాలో జరిగిన మాతృ మరణంపై సంబంధిత ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బందితో ఆయన చర్చించారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, డీఐఓ డాక్టర్ సుబ్బరాజు, గైనిక్ విభాగాధిపతి డాక్టర్ జయంతి, డాక్టర్ సుస్మిత, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రాధికారాణి, డాక్టర్ సుప్రద, డాక్టర్ యానిగ్రేస్ పాల్గొన్నారు.

ఎండ నుంచి రక్షణ చర్యలు అవసరం

వేసవికి ముందే ఎండలు అధికంగా ఉండటం వల్ల ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు సూచించారు. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల శరీరం నుంచి చెమట రూపంలో నీరు, లవణాలు బయటకు పోయి డీహైడ్రేషన్‌కు గురవుతారని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళుతున్న విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. వడదెబ్బ సోకకుండా లేత రంగులో, తెలుపు రంగు ఉన్న వస్త్రాలు ధరించాలని చెప్పారు. ఎండ తగలకుండా తలకు టోపీ ధరించాలని, తేలికగా జీర్ణమయ్యే శాకాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. పరీక్షల సమయంలో అపరిశుభ్రమైన వాతావరణంలో విక్రయించే పానీపూరి, న్యూడిల్స్, పిజ్జా, బర్గర్, తదితర జంక్ ఫుడ్లు మానివేయడం చాలా ఉత్తమని విద్యార్థులకు సూచించారు. ఆరుబయట ఈగలు వాలిన, దుమ్ము, ధూళి పడిన తినుబండారాలు తిని రోగాలు కొని తెచ్చుకోవద్దని చెప్పారు. మంచి నీరు ఎక్కువగా తాగాలని, కొబ్బరి నీరు, నిమ్మరసం, మజ్జిగ, షరబత్ పానీయాలు తీసుకోవడం వల్ల శరీరం కోల్పోయిన లవణాలు తిరిగి పొందవచ్చని సూచించారు. భోజనానికి ముందు, మల విసర్జన తరువాత తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. మానసిక ఒత్తిడి లేకుండా యోగ చేయాలని తెలిపారు.



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రావణ్‌బాబు

విద్యార్థుల సెల్‌ఫోన్లు చోరీ

గుంటూరు ఈస్ట్: పరీక్ష రాసేందుకు వచ్చిన 20 మంది డిగ్రీ విద్యార్థులు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఘటన లక్ష్మీపురంలో జరిగింది. సిమ్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు పరీక్ష రాసేందుకు బుధవారం లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళ కళాశాలకు వచ్చారు. తమ సెల్‌ఫోన్లను ఒక వాహనంలోని బ్యాగులో పెట్టి పరీక్ష రాసేందుకు హాలులోకి వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా అవి కనిపించలేదు. విద్యార్థులందరూ ఒకే బ్యాగులో సెల్‌ఫోన్లు పెట్టడం గమనించిన ఆగంతకుడు చోరీ చేశాడు. ఈ మేరకు విద్యార్థులంతా పట్టాభిపురం పోలీసు స్టేషన్‌కు వెళ్లి మౌఖికంగా ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఏర్పాటు చేసిన వాట్సాప్ నంబరుకు పోలీసులు ఫిర్యాదు పంపారు. సెల్‌ఫోన్లు గుర్తించేందుకు సాంకేతిక సిబ్బంది ప్రయత్నం చేస్తున్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

గుంటూరు రూరల్: గుంటూరు రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 17వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జె.శోభారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షురాలు పులగం దివ్య అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, వైస్ ఎంపీపీలు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు చేబ్రోలులో గడప గడపకు మన ప్రభుత్వం

చేబ్రోలు: మండల కేంద్రమైన చేబ్రోలు–4 గ్రామ సచివాలయం పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య హాజరవుతారని చెప్పారు.

లలిత కళలు భారతీయ సంస్కృతికి పట్టుగొమ్మలు

కళాశాల విద్య ఆర్జేడీ జ్యోత్స్నకుమారి



శివరామకృష్ణశర్మ దంపతులను సత్కరిస్తున్న జ్యోత్స్నకుమారి, కుటుంబరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: లలిత కళలు భారతీయ సంస్కృతికి పట్టుగొమ్మలని కళాశాల విద్య ఆర్జేడీ వి.ఆర్.జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో బుధవారం చెరువు సూర్యనారాయణమూర్తి–సీతారామమ్మ పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ భారతీయ కళలు మానసిక ఆనందంతో పాటు దేశభక్తి ప్రబోధించి, సంస్కృతిపై ఎనలేని ప్రభావం చూపాయని చెప్పారు. హిందూ కాలేజీ – హైస్కూల్స్ కౌన్సిల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ హరికథ వంటి కళలు అంతరించిపోకుండా సంబంధిత కళాకారులకు తగిన ప్రోత్సాహం, చేయూత నివ్వాలని సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించబడినప్పుడే ప్రజలకు మన సాంస్కృతిక విలువలు తెలుస్తాయని చెప్పారు. పురస్కార గ్రహీత, హరికథా కౌముది బ్రహ్మశ్రీ ధూళిపాళ శివరామకృష్ణశర్మ భాగవతార్ మాట్లాడుతూ సినిమాల ప్రభావంతో కళలకు ఆదరణ తగ్గినప్పటికీ, హరికథ వంటి కళారూపాలు ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భాగవత, శతక పద్య పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన భక్తప్రహ్లాద హరికథా గానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ కార్యదర్శి కేఎస్సార్ కుటుంబరావు, హిందూ కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లికి అప్పగింత



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న ఎస్ఐ ఏకనాథ్

గుంటూరు ఈస్ట్: ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడ్ని పట్టాభిపురం పోలీసులు కొన్ని గంటల్లోనే తల్లిదండ్రులకు అప్పగించారు. ఏఎస్ఐ ఏకనాథ్ తెలిపిన వివరాల ప్రకారం .. కోబాల్డ్‌పేటకు చెందిన షేక్ సమీరా కుమారుడు ఆరు సంవత్సరాల సాహిద్ బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ఒంటరిగా ఉండటం పోలీసులు గమనించి స్టేషన్‌కు తరలించారు. అదే సమయంలో బాలుడు అదృశ్యమైనట్లు పట్టాభిపురం పోలీసు స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. బాలుడ్ని అక్కడకు తీసుకెళ్లి తల్లి సమీరాకు అప్పగించారు. కుమారుడిని అప్పగించినందుకు ఆమె ఆనందాన్ని వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

కృష్ణారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి ధర్మాన

గుంటూరు రూరల్: రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన 48వ డివిజన్ కార్పొరేటర్ టి.కృష్ణారెడ్డి(54) కుటుంబాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం పరామర్శించారు. తొలుత రెడ్డిపాలెం గ్రామంలోని కృష్ణారెడ్డి నివాసంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ కృష్ణారెడ్డి తన రాజకీయ జీవితంలో నీతి నిజాయితీలను నమ్ముకుని తమ డివిజన్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఓటమి ఎరుగని నాయకుడిగా మంచి పేరు ప్రఖ్యాతులు గడించాడన్నారు. ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ ఆయన నీతి నిజాయితీలను మెచ్చిన డివిజన్ ప్రజలు గత ఎన్నికల్లో పోటీలేని ఏకగ్రీవంగా కార్పొరేటర్‌గా ఆయనను ఎన్నుకున్నారని దానిని బట్టి చూస్తే కృష్ణారెడ్డి ఎంత మంచి పేరు సంపాదించాడో అర్థమవుతుందన్నారు.



కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ ఆళ్ల

చిరుధాన్యాల సాగుపై అవగాహన అవసరం

గుంటూరు రూరల్: ప్రస్తుతం రబీ సాగులో చిరుధాన్యాలు సాగు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.రాజకుమారి తెలిపారు. మండలంలోని వెంగళాయపాలెంలో చిరుధాన్యాల సాగుపై రైతు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ చిరుధాన్యాల సాగువల్ల భూమి సారవంతంగా మారుతుందన్నారు. చిరుధాన్యాలు తినటం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆత్మ డీడీఏ రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా చిరుధాన్యాలు సాగు చేయాలన్నారు. చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు అందించే సబ్సిడీలను వివరించారు. మహిళలకు కిచెన్ గార్డెన్ నిర్వహణ ఏవిధంగా చేసుకోవాలి, దాని వలన కలిగే లాభాలు వివరించారు. కార్యక్రమంలో భాగంగా రైతులకకు, మహిళలకు చిరు ధాన్యాలు, చిరు సంచుల కిట్స్‌ను, గార్డెన్ కిట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రవీణ, శ్రీనివాసరావు, ఏవో సుబ్రమణ్యం, వీఏఏ పవన్, ఎమ్‌సీఆర్‌పీ గురవయ్య, సర్పంచ్ లలిత కుమారి, నాగరాజు, శృతి, నాగరాణి, మాధవి, శాంతి, దినాకుమారి, ప్రియాంక పాల్గొన్నారు.



చిరు సంచులను మహిళా రైతులకు అందజేస్తున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి తదితరులు

వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాల సందర్శన

పెదకాకాని: రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు చేసిందని సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలను బుధవారం 25 మంది ట్రైనీ కలెక్టర్ల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. మన బడి నాడు- నేడు పథకం ద్వారా శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను కూడా కార్పొరేట్ పాఠశాలలుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఇంగ్లిష్ మీడియంలో బోధనలు ప్రవేశపెట్టడంతో ప్రభుత్వ పాఠశాల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతున్న విధానాన్ని వివరించారు. ట్రైనీ కలెక్టర్‌లు అన్ని తరగతులకు తిరుగుతూ నేరుగా విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఎస్ఎస్ఏ అధికారి అపర్ణ, గుంటూరు ఏఎంఓ జాలాది రవి, ప్రధానోపాధ్యాయిని చిగురుపాటి కల్యాణి పాల్గొన్నారు.



వెనిగండ్ల జెడ్పీ స్కూల్‌లో ట్రైనీ కలెక్టర్‌లతో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు

చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు

గుంటూరు రూరల్: చిరుధాన్యాల ఆహార పదార్థాలు తీసుకోవటం వలన ఆరోగ్యానికి మేలు అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంఎస్ చైతన్య కుమారి తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాంలో సామాజిక విజ్ఞాన కళాశాలలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా చిరుధాన్యాల వలన కలిగే ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ మాట్లాడుతూ చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, సామలు, వరిగెలు, అరికెలు, ఊదలు గురించి వాటి పోషకాల గురించి వాటి వలన కలిగే ఆరోగ్యాలను గురించి వివరించారు. చిరుధాన్యాలు శరీరానికి పెరుగుదల, శరీర నిర్మాణం, మధుమేహాలు, కొలెస్ట్రాల్ నియంత్రించటంతో ప్రథమ పాత్ర పోషిస్తాయన్నారు. ఎముకల ధృడత్వం పెరుగుతుందని, బరువు తగ్గేందుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసి చిరుధాన్యలతో ఆహార పదార్థాలు ఏవిధంగా తయారు చేసుకోవచ్చు వివరించారు. కళాశాల విద్యార్థులు ఇంటర్న్ షిప్‌లో భాగంగా చిరుధాన్యాల న్యూట్రిన్‌బార్, రాగి చాక్లెట్, కొర్రకేకు, జొన్న చెక్కలు, సాముల పాయసం, రాగిమాల్ట్, రాగి బిస్కెట్‌లను తయారు చేసి విద్యార్థులకు రుచి చూపారు. కార్యక్రమంలో డాక్టర్ గోపిరెడ్డి పద్మినిదేవి, బి.అనూరాధ, ఎస్.అనూష పాల్గొన్నారు.



చిరుధాన్యాల ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న విద్యార్థినులు

సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా పుట్టారావు

గుంటూరు మెడికల్: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం (ఏపీ ఎన్జీవో అనుబంధం) గుంటూరు నగర శాఖ అధ్యక్షుడిగా వి.పుట్టారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని ఏపీ ఎన్జీవో హోంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఏపీ ఎన్జీవో గుంటూరు నగర కార్యదర్శి చింతల కళ్యాణ్ కుమార్ వ్యవహరించారు. సచివాలయ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఏపీ ఎన్జీవో నగర అధ్యక్షుడు ఎస్.వి.ఎస్.సూరిని ఎన్నుకున్నారు. సహాధ్యక్షురాలిగా రమాదేవి, ఉపాధ్యక్షులుగా టి భాస్కర్, ఏ అరుణ, సీహెచ్. వి.కృష్ణ, కార్యదర్శిగా ప్రేమ్ సాగర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం. సాంబయ్య, సంయుక్త కార్యదర్శిగా సంగీతరావు, రవి నాయక్, అరుణ, మహిళా సంయుక్త కార్యదర్శిగా షేక్ కరీమున్నీసా, కోశాధికారిగా ఎం. రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



నూతనంగా ఎన్నికైన సంఘం నేతలతో ఏపీ ఎన్జీవో నేతలు

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణ

పాత గుంటూరు: కొత్తపేటలోని గణేశ్వరరావు వీధిలోని షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం దశమ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామికి కాకడా హారతి, నిత్య పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా విజయవాడ సాయిదుర్గ సంకీర్తన భజన మండలి ఈశ్వర్, జయలక్ష్మి బృందం హనుమాన్ చాలీసా పారాయణం, సాయి నామ సంకీర్తనల్ని ఆలపించాయి. కార్యక్రమాన్ని నిర్వాహకులు వి.యల్. నరసింహారావు పర్యవేక్షించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు